

ఆమె స్వతహాగా పరిపూర్ణ.
అతను అచ్చమైన అరసున్నా.
శక్తి తోడైతేనే పురుషుడికి పూర్ణత్వం సిద్ధిస్తుంది.
**మూడు మూర్తులకును మూడు లోకములకు**
**మూడు కాలములకు మూలమగుచు**
**భేదమగుచు దుదినభేదమై యొప్పారు**
**బ్రహ్మమనగ నీవ ఫాలనయన..**
అంటాడు పోతన భాగవతంలో.



ముగ్గురు మూర్తులు కనిపిస్తారు. కానీ ఉన్నది ఒక్క మూర్తే. మూడు లోకాలుగా కనిపిస్తాయి. కానీ ఉన్నది ఒకటే పదార్థం. మూడు కాలాలుగా లెక్కలేసుకుంటాం. కానీ ఉన్నది ఒకటే స్వరూపం. ఆమె.. అమ్మే! సత్యం, సత్యం, పునఃసత్యం. సత్యం సత్యం.. నసంశయః ముల్లోకాలను ఆ తల్లి పాలించిన విధానం, ముగ్గురు మూర్తులను సమన్వయం చేసుకున్న తీరు, త్రికాలాలను నేత్రద్వయంతో నడిపించే పద్ధతి.. అచ్చమైన పాలన పాఠాలు.. 'శక్తి మేనేజ్‌మెంట్' అని పిలుచుకోవచ్చు. 'నవదుర్గ నాయకత్వం'గా అభివర్ణించవచ్చు. పాలకులలో శక్తి అంశ ఉన్నప్పుడే.. ఇదంతా సాధ్యం అవుతుంది. రెచ్చగొట్టి విభజించే, విభజించి పాలించే అసురపాలన మనకొద్దు. పన్నాగాలతోనో, పదవీకాంక్షతోనో ఏ దురాత్ములో ఆ దుస్సాహసం చేసినా.. అమ్మ వమ్ము చేస్తుంది. ధర్మాన్నే గెలిపిస్తుంది.

ముగురమ్మల మూలపుటమ్మ.. సహజ నాయకురాలు. మాతృప్రేమ పొంగి పొర్లుతూ ఉంటుంది. అమ్మతనపు పాలనలో నాయకుడు లేదా నాయకురాలు తన బృందంలోని ప్రతి ఒక్కరినీ బిడ్డలానే చూస్తారు. తప్పు చేసినప్పుడు బిడ్డను తల్లి దండించినట్టే దండిస్తారు, తల్లి శిక్షించినట్టే శిక్షిస్తారు. మహాకవి కాళిదాసు వృత్తాంతమే ఇందుకు ఉదాహరణ. భోజ మహారాజు ఆస్థానంలో ముగ్గురు దిగ్గజ కవులు.. దండి, భవభూతి, కాళిదాసు. వారిలో ఎవర్ని 'మహాకవి' అని సంబోధించాలి? అనే సందేహం కలిగింది భోజరాజుకు. ఎవరికివారు మహాపండితులే. ఆ ముగ్గురి ప్రతిభను బేరీజు వేయగల తూకంరాయి ఎవరి దగ్గర ఉంటుంది? అందులోనూ నిష్పాక్షికంగా నిర్ణయం తీసుకోవాలి. దీంతో భోజుడు ఆ బాధ్యత ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి మీద పెట్టాడు. ముగ్గురినీ తీసుకుని ఆలయానికి వెళ్లాడు. తన సందేహాన్ని మూల మూర్తికి నివేదించాడు. కొద్దిసేపటికి 'కవిర్దండి' అనే పలుకులు వినిపించాయి. నిజమే, కవి అంటే.. దండే! 'భవభూతిస్తు పండితః'.. పాండిత్యమంటే భవభూతిదే అనే పలుకూ వెలువడింది. ఒకరికి కవి అనే కితాబు అందింది. మరొకరికి పండితుడనే ముద్ర లభించింది. తన దగ్గరికి వచ్చేసరికి.. ఎలాంటి స్పందనా లేకపోయేసరికి కాళిదాసుకు కోపం వచ్చింది. ఆగ్రహంతో ఊగిపోయాడు. కళ్లు ఎర్రబడ్డాయి. మాటలు తడబడుతున్నాయి. శరీకంలో చిన్నగా వణుకు. గొంతులో కాఠిన్యం. 'మరి నేనెవర్నే?' అన్నాడు తీవ్రస్వరంతో. సింహవాహిని అయిన అమ్మ దర్శనం కోసం త్రిమూర్తులు సైతం సింహద్వారం వద్ద ఎదురుచూస్తుంటారట. ఆమెతో మాట్లాడాల్సి వస్తే.. ఎక్కడ తమ నోటి ఎంగిలి ఎగిరిపడి ఆమెను తాకుతుందో అనే భయంతో గంగా జనకుడు సైతం నోటికి చేయి అడ్డు పెట్టుకుని మాట్లాడతాడట. అలాంటి వ్యక్తిని మర్యాదలేకుండా ఏకవచనంతో సంబోధించడం ఏమిటి? ఆ స్థానంలో మరొకరు ఉంటే.. కాళిదాసు బూడిదైపోడూ! యమభటులు వచ్చి రౌరవాది నరకాలకూ తరలించరూ? కానీ, అమ్మ పాలనలో అంత కర్కశత్వం ఉండదు. 'త్వమేవాహం త్వమేవాహం. త్వమేవాహం న సంశయః' అని పలికింది అంబ. 'నువ్వే నేను. నేనే నువ్వు. సందేహమే వద్దు' అని ప్రకటించింది. 'నీ అక్షరం.. బీజాక్షరం' అని చెప్పకనే చెప్పింది. కాళిదాసుకు తాను చేసిన తప్పూ తెలిసొచ్చింది. కన్నీళ్లతో మహంకాళి పాదాల మీదపడ్డాడు. ఎదుటి మనిషి తన తప్పు తాను తెలుసుకునేలా చేసే శక్తి ఒక్క ప్రేమకే ఉంది. ముజ్జగాల పాలన సూత్రాల్లో అది కీలకం.

**మహాదాత..**

నాయకత్వం అంటే.. నలుగురితో పంచుకోవడం! నైపుణ్యం, డబ్బు, పలుకుబడి, ప్రతిభ.. పంచుకున్నకొద్దీ పెరుగుతాయి. నాయకుడి చేతికి ఎముక ఉండకూడదు. అమ్మవారి నాయకత్వ శైలి కూడా అలాంటిదే. ఒకప్పుడు కాంచీపురాన్ని ఆకాశరాజు పాలించేవాడట. ఆయనకు సంతానం లేదు. ఆ భాగ్యం కోసం తపస్సు చేశాడు. కామాక్షమ్మ ప్రత్యక్షమైంది. 'ఎలాంటి బిడ్డ కావాలి?' అని అడిగింది. 'వినాయకుడు' అని జవాబిచ్చాడు.

## అన్నపూర్ణేశ్వరి..

అమ్మ బిడ్డ కడుపును చూస్తుంది. ఆకలిని గ్రహిస్తుంది. రుచిని, అభిరుచిని అర్థం చేసుకుని.. నచ్చిన పదార్థాలను వండి వడ్డిస్తుంది. అదే అమ్మ బిడ్డ అనారోగ్యంతో ఉన్నప్పుడు పత్యం పెడుతుంది. ఆ పసివాడికి అయిష్టమని తెలిసినా.. ఔషధగుణాలు ఉన్న ఆహారం తినిపిస్తుంది. అవసరమైతే బెదిరిస్తుంది. కన్నెర్రజేస్తుంది. నోట్లో కుక్కేస్తుంది. బిడ్డ శ్రేయస్సు తనకు ముఖ్యం. జగదాంబ నాయకత్వశైలి కూడా అలాంటిదే. చాంగటి కోటేశ్వరరావు తన ప్రవచనంలో ఒక నిజ జీవిత గాథను ప్రస్తావిస్తారు. ఓ అగ్రహారంలో తాడేపల్లి రాఘవ నారాయణశాస్త్రి అనే పెద్ద మనిషి ఉండేవారట. ఆయన అమ్మవారి ఉపాసకుడు. కానీ పరమ దారిద్ర్యం. పేదరికాన్ని కూడా ఆ తల్లి ప్రసాదించిన ఐశ్వర్యంగానే భావించేవారు. నిత్యం ఇరవై ఏడు పర్యాయాలు లలితా సహస్రనామం చదివేవారు. చివరన నైవేద్యం పెట్టేవారు. ఇంట్లో ద్రవ్యాలు నిండుకున్నప్పుడు పటిక బెల్లపు ముక్క పెట్టేవారు. అదీ లేకపోతే, మంచి నీళ్లనే నివేదించేవారు. ఓ రోజు పూజ తర్వాత నీరసంతో స్పృహతప్పి పడిపోయారు. మరుక్షణమే.. పూజాగదిలోంచి అమ్మవారు బయటికి వచ్చి.. నారాయణశాస్త్రికి పాయసం తినిపించారట. అది కలో, కల్పనో కాదనడానికి సాక్ష్యంగా.. నేల మీద పాయసం ఆనవాళ్లు, అడుగున కొంచెం పాయసం మిగిలి ఉన్న వెండి గిన్నె అక్కడ ఉన్నాయట. అప్పటినుంచీ ఆ ఇంటి ఆర్థిక స్థితి మారిపోయిందట. ఆయన సంకల్పానికి తిరుగులేకుండా పోయింది. ఆయన ఆశీర్వదిస్తే జరిగితీరాల్సిందే. అదీ అమ్మవారి మాతృప్రేమ.

